# ప్రజల మాట ప్రగతి బాట







ప్రచారంలో పాల్గొన్న పోచారం కూతురు అరుణారెడ్డి, కోడలు సోనీరెడ్డి, నస్రుల్లాబాద్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

## బీఆర్ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం

బాన్సువాడ టౌన్/నస్రుల్లాబాద్, నవంబర్ 22 : బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మద్దతుగా బాన్సువాడలోని 8వ వార్డు లో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సతీమణి సోనిరెడ్డి, స్పీకర్ పోచారం కూతురు అరుణారెడ్డి, అల్లుడు శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టో, నమూనా బ్యాలెట్‌ను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ చైర్మన్ ఎర్వాల కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు దొన్కంటి వెంకటేశ్, రమాదేవి, సరిత, లింగమేశ్వర్, రవీందర్‌రెడ్డి, కిరణ్ కుమార్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు సాయిలు, వెంకన్న, రామకృష్ణ, నర్సగొండ, వినోద్, బీఆర్ఎస్ బాన్సువాడ పట్టణ మహిళా కార్యదర్శి ప్రతిమారెడ్డి, దాసరి సుప్రియ, అనసూయ, మహిళలు తదితరులు పాల్గొన్నారు. నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు జోరుగ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజలుకు వివరించారు. సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు మహేందర్, నాయకులు కర్ణం భాస్కర్, పెర్క కృష్ణ, మహేందర్, రఫీ, బచ్చయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాకోరును తరమండి.. అభివృద్ధిని ఆశీర్వదించండి

- రాబందుల్లా వచ్చిన వారిని ఓటుతో బుద్ధిచెప్పండి
- ప్రశాంతమైన నియోజకవర్గంలోని ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు నాన్‌లోకల్ నాయకుల కుట్రలు
- దళితుల భూములు ఆక్రమించుకున్న 'ఏనుగు'ను పీనుగులా పంపండి
- కాంగ్రెస్ నుంచి భారీగా బీఆర్ఎస్‌లో చేరిన యువకులు
- బోర్లం ఎన్నికల ప్రచారంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



బోర్లం గ్రామంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి



డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు

బాన్సువాడ రూరల్, నవంబర్ 22 : బాన్సువాడ నియోజకవర్గంలో గత పది సంవత్సరాల కాలంలో దాదాపు రూ. 10వేల కోట్లతో అభివృద్ధి చేసిన పోచారం కావాలా? దళితుల భూములు ఆక్రమించుకున్న భూకబ్జాకోరులు కావాలా? నియోజకవర్గ ప్రజలు ఆలోచించాలని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం మండలంలోని బోర్లం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి నియోజకవర్గ ప్రజలే తన బలం, బలగంలా భావించి నిరంతరం ప్రజల అభివృద్ధికి పని చేశారని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలోని ప్రజల మధ్య చిచ్చుపెట్టి లబ్ధిపొందేందుకు కొందరు నాన్‌లోకల్ నాయకులు కుట్రలు పన్నుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి వారిని ఓటు ద్వారా తరిమి కొట్టాలని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో 11వేల డబుల్‌బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేసి పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత స్పీకర్‌కు దక్కిందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థుల చరిత్ర హీనమైనదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి దళితుల భూములను ఆక్రమించి ఎదురు తిరిగిన వారిపై పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసులు పెట్టించి కొట్టించిన దుర్మార్గుడని విమర్శించారు.

అతనో భూ కబ్జాకోరని, బట్టేబాజ్ నాయకుడని ఆయన అరాచకాలు అన్నీ, ఇన్నీ కావని విమర్శించారు. 2018 ఎన్నికల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో టీఆర్ఎస్ తరపున ఓడిన ఏకైక వ్యక్తి ఏనుగు రవీందర్‌రెడ్డి అని, మంచి పనులు చేయకపోవడంతోనే గత ఎన్నికలో అక్కడి ప్రజలు ఆయనను చిత్తుగా ఓడించారని అన్నారు. బాన్సువాడ ప్రాంతంలో భూములను ఆక్రమించడానికి, అక్రమంగా డబ్బులు సంపాదించడానికి ఇక్కడి వచ్చాడని విమర్శించారు. ఎల్లారెడ్డి, నిజామాబాద్‌లో చెల్లని రూపాయలు ఇక్కడ ఎలా చెల్లుతాయని ప్రశ్నించారు. రాబందుల్లా వచ్చి ఇక్కడి ప్రజలను పీక్కుతినేందుకు వచ్చారని దుయ్యబట్టారు. 40 సంవత్సరాలుగా బాన్సువాడ ప్రజల కోసం పని చేస్తున్న నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి స్థానికుడని తెలిపారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంట్ చాలంటూ ప్రకటనలు చేస్తూ రైతులను మోసం చేసే కుట్రలు పన్నుతున్నారని అన్నారు. మూడు గంటలు కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్ కావాలా? 24 గంటల పాటు ఉచిత కరెంటు ఇస్తున్న బీఆర్ఎస్ కావాలా? ప్రజలు ఆలోచించాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పేదింటి కుటుంబాలలో వెలుగులు నింపామని చెప్పారు. 70 సంవత్సరాలు పాలించి ప్రజల సంక్షేమం పట్టించుకొని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏం చేస్తుందని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రజలు ఆలోచించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి లక్ష ఓట్ల మెజార్టీతో కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన పర్వం రెడ్డితోపాటు మొదటి సారి ఓట హక్కు వినియోగించుకొనున్న 50 మంది యువకులను గులాబీ కుండవా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ నాయక్, రాజేశ్వర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ నెర్రె నర్సింహులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గోపన్‌పల్లి సాయిలు, సర్పంచు సరళ, ఎంపీటీసీ శ్రావణి, మండల నాయకులు దొడ్ల వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి దేవేందర్‌రెడ్డి, జలీల్, మైబూబ్, మంద శ్రీనివాస్, నాగభూషణం, ఆనంద్, గంగారాం, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఆటోవాలాల జీవితాలను బాగు చేయాలనే

## ఫిట్‌నెస్ ట్యాక్స్ రద్దు

**రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి**

బాన్సువాడ టౌన్, నవంబర్ 22 : ఆటో వాలాల జీవితాలను బాగుచేయాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఫిట్‌నెస్ ట్యాక్స్‌ను రద్దు చేశారని రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి అన్నారు. ట్యాక్స్‌ను రద్దు చేసినందుకుగాను బాన్సువాడ పబ్లిక్ ఆటో యూనియన్ ఆధ్యర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలోని ఆటో స్టాండ్ వద్ద సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం చిత్ర పటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 95 శాతం ఆటో డ్రైవర్లు నిరుపేదలని అన్నారు. వారు రోజంతా ఆటో నడిపితే కానీ.. వారి ఇల్లు గడవని పరిస్థితి ఉంటుందని, అలాంటి వారికి ఫిట్‌నెస్‌ను రద్దు చేస్తే వారి కుటుంబాల్లో సంతోషం నింపడమేనని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలని, అందుకు గాను యూనియన్ తరపున ప్రతి ఒక్కరం తమ వంతు సహకారం అందించడానికి ఎళ్లవేళలా ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ పబ్లిక్ ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహ్మద్ ఎజాస్, ఆత్మ కమిటీ చైర్మన్ మోహన్ నాయక్, బాన్సువాడ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు భూషన్‌గౌడ్, కార్యదర్శి గంగారాం, యూనియన్ సభ్యులు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## టీయూ ఐక్యూఏసీ డైరెక్టర్‌గా డాక్టర్ అడికె నాగరాజు నియామకం

డిచ్‌పల్లి, నవంబర్ 22 : టీయూ వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు టీయూలోని కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అడికె నాగరాజును ఐక్యూఏసీ డైరెక్టర్‌గా నియమించామని రిజిస్ట్రార్ యాదగిరి తెలిపారు. అడికె నాగరాజుకు రిజిస్ట్రార్ యాదగిరి బుధవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. నాగరాజు గతంలో పరీక్షల నియంత్రణాధికారిగా, అసిస్టెంట్ కంట్రోలర్, అడిషనల్ కంట్రోలర్‌గా, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా, బీవోఎస్‌గా విధులు నిర్వర్తించారు.

## గజ్జెలమ్మ జాతరలో అపశృతి

రుద్రూర్, నవంబర్ 22 : రుద్రూర్ మండలం అంబం గ్రామంలో బుధవారం నిర్వహించిన గజ్జెలమ్మ జాతరలో అపశృతి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. విద్యుత్ షాక్‌తో మాధవరావు(20) మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. జాతర ఉత్సవాల్లో భాగంగా రథాన్ని గ్రామంలోకి తీసుకొస్తున్నారు. ఈ ప్రయత్నంలో రథానికి రోడ్డుపై ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో రథాన్ని పట్టుకున్న నలుగురు వ్యక్తులకు విద్యుత్ షాక్ తగిలింది. మాధవరావు అక్కడికక్కడే స్పృహ కోల్పోయాడు. మిగతా ముగ్గురికి తీవ్ర గాయాలుకాగా వెంటనే అంబులెన్స్ సహాయంతో నలుగురిని బోధన్ దవాఖానకు తరలించారు. తీవ్ర గాయాలైన మాధవరావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గాయాలపాలైన కుర్లెం గంగాధర్, కుర్మ పోశెట్టి, జజ్జెరి శివను ప్రైవేటు దవాఖానకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. కోటగిరి మండలం సుంకిని గ్రామానికి చెందిన మాధవరావు అంబంలో గజ్జెలమ్మ జాతర ఉత్సవాలకు వచ్చి మృతి చెందడంతో గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.